క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం , ప్రత్యేకంగా పూజలు చేసి అలంకరించారు. ఖడ్గమాల స్తోత్రం పారాయణం అర్చకుడు పిడతల పవన్ కుమార్ ఆధ్వర్యంలో చేశారు. మధ్యాహ్నం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చీమల పవన్ కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయాలని వినతి

ప్రొద్దుటూరు : సంక్షేమ పథకాలను గ్రామీణ రైతులకు, యువతకు అందించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక నాయకులు మంగళవారం ప్రొద్దుటూరు పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమ, పాల ఉత్పత్తుల పెంపుదల, గొర్రెలు, మేకలు, బర్రెలు, కోళ్ల పెంపకంపై సబ్సిడీ పథకాలను అమలు చేయాలని తెలిపారు. రోగాల బారిన పడిన పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరసింహారెడ్డి, నాగేంద్ర, రవితేజ, శ్రీను, రియాజ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం



మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని చౌటపల్లె సచివాలయంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 280 మందికి వివిధ రకాల వ్యాధులు, సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు శ్రీనివాస్, హిమబిందు, సుధేష్ణ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజీ రఘురామిరెడ్డిలు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్ వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఫార్మాసిస్టు శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

52 మద్యం బాటిళ్లుస్వాధీనం

పోరుమామిళ్ల : కవలకుంట్ల సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వీరపోగు అబ్రహాం, కవలకుంట్ల పాపయ్యను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 52 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం విశ్వసనీయ సమాచారంతో సిబ్బందితో దాడి చేసి అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న ఇరువురిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ దాడిలో ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రోన్ ఆవిష్కరణ



ద్రోని డ్రోన్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసకుమార్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గోల్డెన్ పార్కులో గరుడ ఏరోస్పేస్ వారు రూపొందించిన ద్రోని డ్రోన్‌ను ఏపీ డిస్ట్రిబ్యూటర్ దండపాణి కంపెనీ గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీనివాస కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేంద్రసింగ్ ధోని పేరుతో ద్రోని డ్రోన్‌ను రూపొందించారన్నారు. దేశీయంగా రూపొందించిన ప్రథమ డ్రోన్ అని తెలిపారు. గరుడ ఏరో స్పేస్ వారు అగ్రికల్చర్, సర్వే డ్రోన్స్ తోపాటు రకరకాల డ్రోన్స్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. రూ.1.49 లక్షలు విలువ చేసే ద్రోని డ్రోన్‌ను తొలి వంద మందికి రూ.85వేలకే అందించనున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరులో కొనుగోలు చేసిన వారికి మహేంద్రసింగ్ ధోని ఆడనున్న ఐపీఎల్ మ్యాచ్ టికెట్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ డ్రోన్ ద్వారా ఫొటో, వీడియోలు అత్యుత్తమ నాణ్యతతో తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దండపాణి గ్రూప్ ఆఫ్ కంపెనీ వ్యవస్థాపకుడు దండపాణి, గరుడ ఏరోస్పేస్ ప్రతినిధులు శ్యామ్, నిహారిక, పైలెట్ కార్తికేయన్ పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగింపు

అట్లూరు : తంభళ్లగొంది ఎస్సీ కాలనీకి చెందిన యువకులు సొంత ఖర్చుతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించారు. లింగాలకుంట నుంచి తంభళ్లగొంది ఎస్సీ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు అలుముకుని ఉండటంతో.. వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో కాలనీకి చెందిన గొంటు నాగేంద్రా, మద్దూరు మణికంఠ మంగళవారం జేసీబీ యంత్రంతో కంప చెట్లను తొలగించి కాలనీ వాసులచే శభాష్ అనిపించుకున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి



సూరేపల్లె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు రోశయ్య



తొండలదిన్నెలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ

మైదుకూరు : ఓటరు జాబితా ఎంతో పారదర్శకంగా ఉంటుందని మైదుకూరు నియోజకవర్గ సహాయ ఓటరు నమమోదు అధికారి, తహసీల్దార్ వై.నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. రెండు రోజుల కిందట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ ఏ ఎన్నికల్లో లేని విధంగా ఈసారి ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత ఉందన్నారు. గతంలో చనిపోయిన వారు.. నిర్దేశిత చోట నివాసం లేని వారు.. అర్హత లేని వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో ఉండేవన్నారు. ఇప్పటి వరకు ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు మాత్రమే ఉండేవారని తెలిపారు. ఈ దఫా రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లుగా వ్యవహరించారని, అర్హత ఉన్న వారు, ఓటు హక్కు కలిగిన వారి పేర్లు మాత్రమే జాబితాలో చేర్చే అవకాశం కలిగిందన్నారు. అర్హత ఉన్న వారు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం వరకు కూడా తమ ఓటును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 269 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. మంగళవారం మైదుకూరు మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించినట్లు చెప్పారు. ఈసారి హోం పోలింగ్ అనే ప్రక్రియను పోస్టల్ బ్యాలెట్ తరహాలో కొత్తగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎవరైనా మంచానికే పరిమితమైన ఓటరు వద్దకే ప్రత్యేక అధికారుల బృందం ఈవీఎంను తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తారని వివరించారు. ఇది ప్రధాన పోలింగ్‌కు ముందే జరుగుతుందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకొనేలా చూడటమే హోం పోలింగ్ ఉద్దేశమన్నారు. కాగా జగనన్న ఇళ్ల కాలనీలో ఇంటి స్థలాన్ని పొందిన వారికి, ఆ స్థలదాన్ని రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియ వేగంగా జరుగుతోందని తహసీల్దార్ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సాధారణంగా ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేటప్పుడు చెల్లించాల్సిన ఫీజుకు ఈప్రక్రియలో మినహాయింపు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన పూర్తయిన తర్వాత లబ్ధిదారు 10 ఏళ్లకు ఆ స్థలాన్ని విక్రయించుకునే హక్కు ఏర్పడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు మధుసూధన్‌రావు, మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్ఐ నాగేశ్వరి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు రోశయ్య మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సరఫరా, తాగునీరు, టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల నేమ్‌బోర్డులో తహసీల్దారు, ఎస్ఐ, బీఎల్‌ఓల పేర్లు, ఫోన్ నంబర్లు రాయించాలన్నారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం తోపాటు వసతులపై పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించే సౌకర్యాలపై నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గోపవరం, బేతాయపల్లె, రాచాయపేట, టీ.సండ్రపల్లె, ఎస్.రామాపురం, బ్రాహ్మణపల్లె, సూరేపల్లె గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు క్షుణ్ణంగా పరిశీలించారు. తహసీల్దారు వెంట ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్‌ఓలు వెంకటేశ్వర్లు, ఓబులేసు ఉన్నారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : జరగబోవు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. మండలంలోని వెలవలి, తొండలదిన్నె, టంగుటూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, సచివాలయాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్, ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, వీఆర్‌ఓలు చెలమయ్య, ఎల్లారెడ్డి, సరళ, పంచాయతీ కార్యదర్శులు బాబు, శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో నాణ్యమైన వైద్యం



లక్ష్మీపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష మందులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్షుమయ్య, అధికారులు

చాపాడు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించిన ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి ఆయా గ్రామాల్లోని పేదల ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ బీపీ, సుగర్, ఇతర రక్త పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అన్ని రకాలైన వసతులతో కూడిన వైద్య బృందాన్ని ప్రజల వద్దకే పంపిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. వైద్యాధికారులు కావ్య మాధురి, ఓబులేసు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, జయరాజు, సీహెచ్‌ఓ మహదేవయ్య, ఎంపీహెచ్‌ఈఓ రాఘవయ్య, ఆశా నోడల్ అధికారి సుకన్య, సూపర్‌వైజర్ బాబుల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి

మైదుకూరు : ప్రభుత్వం పేద మధ్యతరగతి వారి కోసం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని జీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తువ్వపల్లె సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, చికిత్సలపై తగిన సలహాలు సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులను అందజేస్తారని తెలిపారు. శిబిరంలో 26 మంది గర్భవతులకు, 28 మంది పాఠశాల విద్యార్థులకు, 29 మందికి కంటి వైద్య పరీక్షలుతో సహా 367 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరంలో డాక్టర్ చత్రిపతి హనుమాన్, డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ సుమధుర, 104 వైద్య సిబ్బంది, పీహెచ్‌సీ, వైఎస్సార్ విలేజ్ విలేజ్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించడమే లక్ష్యం

కాశినాయన : ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఓబుళాపురం వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంతోపాటు ప్రతి నెల గ్రామాల్లో పర్యటించి ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఏదైనా అనారోగ్యం బారిన పడినప్పుడు ప్రభుత్వ వైద్యశాలలోనే మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ జయమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటక్రిష్ణారెడ్డి, రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను కాపాడాలి



మాట్లాడుతున్న ఎంవీఐ శేఖర్‌రావు



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ యుగంధర్

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను ఎలాంటి అపోహలకు గురికాకుండా కాపాడవచ్చని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గుడ్ సమరిటన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన గంట (గోల్డెన్ అవర్) లోపు బాధితులను ఆసుపత్రికి చేర్పించి సరైన వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్పిస్తే పోలీసుల నుంచి ఇబ్బందులు ఉంటాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులను నిస్వార్థంగా, స్వచ్ఛందంగా ఆసుపత్రిలో చేర్పించవచ్చని అన్నారు. సరైన సమయంలో క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్పించి వారి ప్రాణాలను కాపాడితే వారికి రూ.5 వేలు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ హిమబిందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రుల పట్ల మానవత్వం చూపాలి

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి పట్ల మానవత్వం చూపాలని ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. గుడ్ సమరిటన్‌పై హోమస్ పేటలోని కల్యాణచక్రవర్తి నర్సింగ్ హోంలో మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎవరైనా సహాయం కోసం ఎదురు చూస్తుంటే వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. ఆస్పత్రిలో చేర్పిస్తే పోలీసుల నుంచి వేధింపులు ఎదురౌతాయని, కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన చాలా మందిలో ఉందన్నారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, పైగా ప్రభుత్వం వారి సేవలను గుర్తించి ప్రశంసా పత్రంతో పాటు నగదుతో సత్కరిస్తుందని చెప్పారు. ఒక చిన్నపాటి సహాయం నిండు ప్రాణాలను కాపాడుతుందని సీఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ క్షతగాత్రుల పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ మురళీధర్, డాక్టర్ వరుణ్‌రెడ్డి, ఎంవీఐ నారాయణనాయక్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటలోని కోదండరామస్వామి ఆలయంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. టీటీడీ ధర్మప్రచార మండలి మాజీ సభ్యుడు డాక్టర్ మూలె రామమునిరెడ్డి మూడు రోజులు ప్రవచనాలు చెబుతారని, 9న కుంకుమ పూజ, 10న హరికథ కార్యక్రమాలు జరుగుతాయని వారు వివరించారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు చంటి, సాల్మన్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికులకు తోపుడు బండ్లు, పనిముట్లు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అమృతానగర్‌లో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, లత, హసీనా, షాబీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌పై కేసు నమోదు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీనివాసనగర్‌లో కుక్కలకు సంబంధించి మందుల వ్యాపారం చేస్తున్న తెల్లాకుల మనోహర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ వర్గానికి చెందిన రాజేశ్వరి మందుల కోసం ఆయన దుకాణానికి వెళ్లి మందులు బేరం చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మందుల ధరలు ఎక్కువగా ఉన్నాయని ప్రశ్నించినందుకు ఆమెను మనోహర్ దూషించాడన్నారు. ఈ సంఘటనపై డీఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలో బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోడంపల్లె 33/11కేవీ, అమృతానగర్, ఖాదరాబాద్, నంగనూరుపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో టౌన్ టెక్నికల్ అభివృద్ధి కోసం 100 ఎస్క్యూఎంఎం నుండి 157 ఎస్క్యూఎంఎం కండక్టర్ టవర్స్ మీద ఎరెక్ట్ పనులు చేయనున్న కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



కె.వసుధారాణి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకురాలు కె.వసుధారాణికి రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పీలేరు ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కాలేజి కంప్యూటర్ అప్లికేషన్ విభాగాధిపతి డాక్టర్ బి.కవిత పర్యవేక్షణలో వసుధారాణి 'ఇంప్రూవింగ్ ది పెర్ఫార్మెన్స్ ఆఫ్ వైర్‌లెస్ కంట్రోల్ నెట్ వర్క్, త్రూ ఆప్టిమైజ్డ్ కాంగేషన్ కంట్రోల్ మిషన్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. మంగళవారం ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్ : మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారుల్లో అవగాహన పెంపొందించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అని అన్నారు.

సబ్‌జైలు సందర్శన

పాన్ ఇండియా 2024 కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ సబ్‌జైలును సందర్శించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడం పాన్ ఇండియా 2024 కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమాల్లో సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి, ఏపీపీ ఉమాదేవి, ఏజీపీ సూర్యనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి.ఎస్.ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు డి.బ్రహ్మారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, ఎస్‌ఐలు, బ్యాంకు మేనేజర్లు, కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, కౌన్సిలర్ మునివంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిత్యం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకమై సమస్యలను పరిష్కరిస్తున్నారని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. ఎంపీ ప్రజలకు అందుబాటులో లేరని టీడీపీ కడప పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ టీడీపీ నాయకుడు శ్రీనివాసులరెడ్డి తన వ్యాపారాల నిమిత్తం బయట ప్రాంతాల్లో గడుపుతుంటే లోకల్‌గా ప్రజల సమస్యలను తెలుసుకునే ఎంపీ అవినాష్‌రెడ్డి ఎలా కనిపిస్తారని ఎద్దేవా చేశారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడుగా ఉన్న సీఎం రమేష్ నాయుడు ఏమేరకు ప్రజలలో ఉన్నారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ప్రజలు అమాయకులు కారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఏకపక్షంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీపీ తెలిపారు. స్థానిక టీడీపీ నాయకుడు సీతారామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుల అరాచకాలు పెరిగిపోతున్నాయనడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా ఈ ప్రాంతంలో అరాచకాలు జరుగుతుంటే ఏ ఒక్క రోజైనా ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నించావా అని నిలదీశారు. స్థానిక టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఈ ప్రాంతం నుండి 40 మంది ప్రజలైనా పాల్గొన్నారా అని ప్రశ్నించారు. 28వ వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా టీడీపీ వారి కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

9న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

గోపవరం : ఈ నెల 9వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేయించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు, టాయ్‌లెట్లకు వెళ్లిన తర్వాత చేతులు శుభ్రం చేసుకునేలా అవకాశం కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలతోపాటు పాఠశాలల ఉపాధ్యాయులు కూడా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్యాధికారులు మురళీక్రిష్ణ, మహేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను తాపించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల వరకు 400 మిల్లీగ్రాముల మాత్రను మింగించాలన్నారు. చిన్నారులకు మాత్రలు మింగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రలను మింగించాలన్నారు. మండల వ్యాప్తంగా 3015 మంది సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్నారని, వీరందరిచే ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించి వంద శాతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో గోపవరం, బేతాయపల్లె డీడీఓలు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, సీహెచ్‌ఓ గౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటకు ఈకేవైసీ తప్పనిసరి



కామసముద్రంలో జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

అట్లూరు : రైతులు సాగు చేసిన పంటలకు ఈకేవైసీ చేయించాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కమలకూరు, మాడపూరు, కొండూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగులో ఉన్న మిరప, జొన్న, నువ్వుల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతూ సాగు చేసిన పంటలను నమోదు చేసుకుంటే.. ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లితే ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. అలాగే పంట నమోదు చేసుకున్న రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రస్తుతం రైతులు పండించిన జొన్నలను ప్రభుత్వం క్వింటాలు ధర 3.180లకు కొనుగోలు చేస్తుందన్నారు. కావున జొన్న రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ద్వారా అమ్ముకోవాలన్నారు. అలాగే సాగులో ఉన్న మిరప, నువ్వుల పైర్లకు అవసరమైన ఎరువులు, మందులు వినియోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కమలకూరు, మాడపూరు, తంభళ్లగొంది, కొండూరు రైతు భరోసా సహాయకులు అనూషా, సందీప్, ఉమామహేశ్వరి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయం పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రమణ్యం

గోపవరం : సచివాలయ సిబ్బంది సమయం పాటించాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం గోపవరం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన సిబ్బంది పట్ల అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోనే గోపవరం మండలానికి సంబంధించి అటెండెన్స్ తక్కువగా ఉందని జిల్లా ఉన్నతాధికారుల నుంచి సమాచారం వస్తుందని, ఇక మీదట ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వలంటీర్లు వారంలో మూడు రోజులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేసి వారికి కేటాయించిన ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా పరిశీలించి.. అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారికి కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో డీడీఓ విజయకుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసినట్లు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగులు, వయోవృద్ధుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం వారు మాట్లాడుతూ దివ్యాంగుల వైకల్యం 80 శాతంపైబడిన వారికి రూ.10వేలు, తక్కువుంటే రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని తెలిపారు. విద్యార్హత, వయసుతో సంబంధం లేకుండా మోటార్ త్రీవీలర్ వాహనాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, అబ్దుల్ రషీద్, యదార్థుడు, కొండమ్మ, లక్ష్మి, సూరయ్య, మహేష్ పాల్గొన్నారు.